# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 26, మార్చి 2026


# జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

## వదంతులను నమ్మవద్దు: జిల్లా ఎస్పీ నితికా పంత్



**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 25, ప్రభాతవార్త**

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని జిల్లా ఎస్పీ నితికా పంత్, ।శీ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురవుతూ, వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపుకునేందుకు ఒకేసారి పెట్రోల్ బంకులకు వెళ్లడం వల్ల అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా కూడా నిరంతరంగా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఎటువంటి కొరత పరిస్థితి లేదని, ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని సూచించారు. అలా చేయడం వల్ల ఇతరులకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు.సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకూడదని, నిర్ధారించని సమాచారాన్ని ఇతరులకు పంపించడం ద్వారా గందరగోళం సృష్టించవద్దని ఎస్పీ తెలిపారు. సాధారణ అవసరాల మేరకే ఇంధనం వినియోగించుకోవాలని, ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని జిల్లా ఎస్పీ కోరారు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, ఎటువంటి వదంతులు వ్యాప్తి చేస్తే లేదా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు చేపడితే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉట్నూర్, మార్చి 25, ప్రభాతవార్త**



మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిమ్స్ నుండి వచ్చిన ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆప్తాల్మాలజీ వంటి ఆరు రకాల స్పెషలిస్ట్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని (మిగతా 2లో..)

## మొబైల్ ఫోన్ల రికవరీలో..

# అద్భుత ఫలితాలు సాధిస్తున్న జిల్లా పోలీస్ యంత్రాంగం

- జిల్లా ఎస్పీ నితికా పంత్
- రూ.10 లక్షల విలువైన 108 మొబైల్ ఫోన్లు రికవరీ, యజమానులకు అందజేత



**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా నిర్వహించారు. గత కొన్ని రోజులుగా పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన సుమారు రూ.10 లక్షల విలువ గల 108 మొబైల్ ఫోన్లను రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల వివిధ (మిగతా 2లో..)

## విద్యారంగ బలోపేతంపై..

# రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

* మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, మార్చి 25, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లాలో విద్యారంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి, ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్య అందించే కేంద్రాలుగా తీర్చిదిద్దేం దుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. ఈ దిశగా జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడు తున్నాయని ఆయన తెలిపారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్‌తో కలిసి పనుల పురోగతిని సమీక్షించి, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని (మిగతా 2లో..)






# పాత విధానమే ముద్దు

## మంచిర్యాల కలెక్టరేట్ వద్ద విశ్రాంత ఉద్యోగుల నల్ల బ్యాడ్జీల నిరసన

**నస్పూర్, మార్చి 25, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పెన్షన్ వాలిడేషన్ చట్టం 2025ను నిరసిస్తూ మంగళవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (టీఎస్జీఆర్ఈఏ) ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. దేశవ్యాప్తంగా ఒకే విధమైన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విశ్రాంత ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ దేశ్‌పాండేకు అందజేశారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దూస కృష్ణ, బెజ్జంకి జగన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పెన్షన్ వాలిడేషన్ చట్టం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. ఈ చట్టం వల్ల దేశంలోని 92 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, లక్షలాది మంది కేంద్ర పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి 25ను బ్లాక్ డేగా పాటిస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. పెన్షనర్ల అస్తిత్వానికే ముప్పు తెచ్చే ఈ ఆర్థిక సంస్కరణలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది భిక్ష కాదని, అది విశ్రాంత ఉద్యోగుల జీవన హక్కు అని వారు గుర్తు చేశారు. స్వర్గీయ డి.ఎస్. నకారే పోరాట (మిగతా 2లో..)

## విద్యార్థుల మేధస్సును పెంపొందించేలా

# వర్డ్ ఫర్ వర్డ్

- సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్



**ఉట్నూర్, మార్చి 25, ప్రభాతవార్త :**

విద్యార్థుల మేధస్సును పెంపొందించే విధంగా రాష్ట్రస్థాయి వర్డ్ ఫర్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలో గల కొమురంభీం కాంప్లెక్స్‌లో ఉట్నూర్ విభ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి వర్డ్ పవర్ ఛాంపియన్ షిప్ పోటీలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, (మిగతా 2లో..)

## స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు, రక్తహీనత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, వీటి నివారణకు ప్రజలు పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని సూచించారు. ఆర్.ఎం.పిల వద్దకు వెళ్లి అనవసరంగా యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని, కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లోని అర్హులైన వైద్యుల సలహా మేరకే మందులు వాడాలని వివరించారు. రక్తహీనత సమస్య ఉన్నవారు ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ టాబ్లెట్లను క్రమం తప్పకుండా వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం దంతన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడుతూ, పనుల్లో వేగం పెంచి వర్షాకాలానికి ముందే నిర్మాణాలు పూర్తి చేసేల ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇసుక కొరత, బిల్లుల చెల్లింపులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారులు సాధన, మనోహర్, టిబి ప్రోగ్రామ్ అధికారి సుమలత, తహసిల్దార్ రఘునాథ్, ఎంపీడీవో రామ్ ప్రసాద్, సర్పంచ్ అంకవ్వ, ఉప సర్పంచ్ మోబిన్, వైద్య సిబ్బంది, ఏఈ లు దివ్య, వంశీ, లబ్ధిదారులు, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్ చట్టం వద్దు.. పాత విధానమే ముద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఫలితంగా లభించిన పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో కొత్త నిబంధనలు పెన్షనర్లకు ఆర్థికంగా, మానసిక వేదన కలిగిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛనుదారులను రెండు వర్గాలుగా విడగొట్టే కుట్రలను సహించబోమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి వివాదాస్పద చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.పాపారావు, కే.నాగేశ్వర్, బి.సత్యనారాయణ, బి.తిరుపతి, ఎల్.ప్రేమ్ కుమార్, కైలాసం, కే.మల్లయ్య, కే.వైకుంఠం, బి.రాజమౌళి, రాష్ట్ర బాధ్యులు ఏ.రాంరెడ్డి, గుండేటి యోగేశ్వర్, మంచిర్యాల యూనిట్ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, కైరం జనార్దన్ తో పాటు పెద్ద సంఖ్యలో పింఛనుదారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మేధస్సును పెంపొందించేలా లిప్ ఫర్ వర్డ్

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 133 ఆశ్రమ, వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులకు లిప్ ఫర్ వర్డ్ అనే ఇంగ్లీష్ లెటర్స్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రత్యేక కృత్యాల ద్వారా విద్యా బోధన నిర్వహిస్తున్నారని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఆంగ్లంలో చదవడం, రాయడం, పలకడం, వొకాబులరీ డెవలప్మెంట్, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులకు వివిధ దశల ద్వారా ఎంపిక చేస్తూ 18 మంది విద్యార్థులకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం జరిగిందని, తరగతికి 6 మంది చొప్పున పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఆంగ్లభాష ప్రావీణ్యంపై పోటీలు నిర్వహించి అంతర్రాష్ట్ర స్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని, వచ్చే నెల 22వ తేదీన ముంబై లో జరగనున్న అంతర్రాష్ట్ర పోటీలకు హాజరవుతారని తెలిపారు. గిరిజన విద్యార్థులకు సరైన రీతిలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలోని ప్రతిభను వెలికి తీయడం జరుగుతుందని, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా బోధన చేయాలని తెలిపారు. అంతర్రాష్ట్ర పోటీలకు ఎంపికైన మాణిక్ పూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. చాందిని, కేతిని ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.రికి, డోడర్న ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన బి. విజయ్ కుమార్ లకు లర్నింగ్ కిట్, జ్ఞాపికలు, ధ్రువపత్రాలు, సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి. డి. జాదవ్ అంబాజీ, ఎ పి ఓ (పి వి టి జి) ఎ. భాస్కర్, ఏజెన్సీ డిప్యూటీ ఈ ఓ గొడం చందన్, నాలుగు జిల్లాల ఏ సి ఎం ఓ లు, జి సి డి ఓ లు, క్రీడా అధికారులు, ఏ టి డి ఓ లు, విద్యార్థుల తల్లిదండ్రులు, విభ అసోసియేట్ డైరెక్టర్ వీరనారాయణ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీమంతం షార్ట్ ఫిలిం విడుదల చేసిన డిప్యూటీ మేయర్ సల్లా రమ్య

మంచిర్యాల, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం సీమంతం షార్ట్ ఫిలింను డిప్యూటీ మేయర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ రమ్య మాట్లాడుతూ ఈ సినిమా ఆడవారిని విశేషంగా ఆకట్టుకునే విధంగా కథనం, డైరెక్షన్ అందులో ఒక సాంగ్ చాలా బాగా చిత్రించడం జరిగిందని తెలిపారు అలాగే కుటుంబ సమేతంగా చూడదగ్గ ఆడవారి మనోభావాలకు అనుగుణంగా ఈ సినిమా ఉంటుందని తెలిపారు. ఆదరించి చానల్ ను సబ్స్క్రైబ్ చేసుకొని మీరంతా కూడా ఆదరించాలని ఈ సందర్భంగా తను కోరారు. ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో గుమ్ముల శ్రీనివాస్, గజ్జెలి వెంకటయ్య, రాజన్న చారి, చంద్రగిరి చంద్రమౌళి, అంకం సతీష్, చెలిమెల అంజయ్య, నిర్మాతల మండలి అధ్యక్షుడు కొమ్ము కుమార్, అశోక వేముల తదితరులు పాల్గొన్నారు.

### మొబైల్ ఫోన్ల రికవరీలో..

# అద్భుత ఫలితాలు సాధిస్తున్న జిల్లా పోలీస్ యంత్రాంగం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల నుంచి గుర్తించి రికవరీ చేశారు. ఈ మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ నితిక పంత్ చేతుల మీదుగా సంబంధిత యజమానులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ ప్రతి వ్యక్తికి అత్యంత ముఖ్యమైందిగా మారిందన్నారు. బ్యాంక్ ఖాతాలు, పాస్‌వర్డులు వంటి వ్యక్తిగత సమాచారాన్ని మొబైల్‌లో సేవ్ చేసుకోవడం వల్ల నేరగాళ్లు దొంగిలించిన ఫోన్ల ద్వారా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మొబైల్ పోగొట్టుకున్న వారు కేవలం ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారం, డబ్బును కూడా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. మొబైల్ ఫోన్ పోయిన లేదా దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేసి ఫోన్‌ను బ్లాక్ చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అలాగే సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే వారు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, తక్కువ ధరకు లభిస్తుందని దొంగిలించిన ఫోన్లు కొనుగోలు చేస్తే మోసాలకు గురయ్యే అవకాశముందని హెచ్చరించారు. దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు .సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా మొబైల్ ఫోన్ల రికవరీలో విశేష కృషి చేసిన ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, ఐటీ కోర్ బృందాన్ని ఎస్పీ గారు అభినందించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు జిల్లా పోలీసులకు, ముఖ్యంగా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఆసిఫాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, వాంకిడి ఇన్స్పెక్టర్ సత్యనారాయణతో పాటు ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యారంగ బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రతి పాఠశాలలో త్రాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, బాలురు–బాలికలకు వేర్వేరు మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, సురక్షిత వాతావరణం వంటి అంశాలను కల్పిస్తూ విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలాగే నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పెంపొందించే దిశగా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సమయానికి పోషకాహారం అందించడం, శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేయడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు అదనపు తరగతి గదులు, భోజనశాల, ఇతర సదుపాయాల నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, పాఠశాలలో అందుతున్న సదుపాయాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసి, వారు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి జీవితంలో విజయాలను సాధించాలని ప్రోత్సహించారు. తదనంతరం కాసిపేట మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన కలెక్టర్, అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. చెత్తను నిరంతరం తొలగిస్తూ పరిశుభ్రతను కాపాడాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కూడా కలెక్టర్ సమీక్షించారు. లబ్ధిదారులు తమకు మంజూరైన ఇళ్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని, ఈ విషయంలో అధికారులు ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని సూచించారు. తరువాత లంబడితండ (కె) గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడి పారిశుధ్య పరిస్థితులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించిన ఆయన, వార్డులు, మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల మందులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం పెద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామ స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుధ్య నిర్వహణను పటిష్టంగా చేపట్టాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా, సమర్థవంతంగా అమలవుతున్నాయని నిర్ధారించేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

సారంగాపూర్, మార్చి 25, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైతు భరోసా నిధులను విడుదల చేయడంపై మండలంలోని గ్రామీణ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ నిధులు రైతులకు ఆర్థికంగా మద్దతు ఇవ్వడమే కాకుండా, పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులను భరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. సాగు సమయంలో ప్రభుత్వం చూపుతున్న ఈ చిత్తశుద్ధి వల్ల పంట పనులకు ఎలాంటి అంతరాయం కలగడం లేదని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇలాంటి రైతు హిత పథకాలు కొనసాగాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కునేరు భూమన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజు నరసయ్య, జిల్లా కోశాధికారి దశరథ్ రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు విలాసరావు, మార్కెట్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే సోషల్ మీడియా కోఆర్డినేటర్లు సురేందర్, సత్యం, కాంగ్రెస్ నాయకులు ఒలాత్రీ నారాయణరెడ్డి, అడ్వకేట్ నవీన్ రెడ్డి, వంగ భూమారెడ్డి, దాసరి రమేష్, మైలి రాజేశ్వర్, సర్పంచ్ జాదవ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకుల వద్ద బారులు..

**- సోషల్ మీడియాలో అసత్య ప్రచారం ప్రభావం**

**- పెట్రోల్ బంకుల వద్ద కిక్కిరిసిన జనం**

మంచిర్యాల, మార్చి 25, ప్రభాతవార్త

*మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియాలో వ్యాప్తి చెందిన ఒక అపోహ ప్రజల్లో ఆందోళనకు దారితీసింది. పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందన్న తప్పుడు ప్రచారం కారణంగా వాహనదారులు పెద్ద ఎత్తున పెట్రోల్ బంకుల వద్దకు తరలి వచ్చారు. ఉదయం నుంచే అనేక బంకుల వద్ద వాహనాల క్యూలు వందల మీటర్ల మేర సాగి, సాధారణ రవాణాకు అంతరాయం కలిగించింది. కొందరు అవసరానికి మించిన ఇంధనాన్ని నిల్వ చేసుకునేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అయితే సంబంధిత జిల్లా అధికారులు ఈ ప్రచారం పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన కొరత ఎలాంటి పరిస్థితిలోనూ లేదని, సరఫరా సాధారణంగానే కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరానికి మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణ లేని వార్తలను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ ఘటన సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగంపై మరోసారి చర్చకు దారితీసింది.*



# ఇందిరమ్మ ఇండ్లకు అందించే ఉచిత ఇసుకను ఇతర పనులకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

### - జిల్లా కలెక్టర్ హరిత

**కెరమెరి మార్చి 25, ప్రభాతవార్త:**

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అందిస్తున్న ఉచిత ఇసుకను ఇతర పనులకు తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరిత అన్నారు. బుధవారం కెరమెరి మండలంలోని అనార్ పల్లి ఎక్స్ రోడ్డు వద్ద భారీ సంఖ్యలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను, ఆపి రశిదులను పరిశీలించి ఎక్కడి నుండి ఇసుకను తరలిస్తున్నారని, ట్రాక్టర్ డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆసిఫాబాద్ రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావు, జైనూర్ కెరమెరి తహసిల్దారుకు, ఛరవాణి ద్వారా సమాచారం అందించి, వెంటనే రసీదులను పరిశీలించాలన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ఎవరైనా ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఉచితంగా అందిస్తున్న ఇసుకను ఇతర పనులకు తరలించే ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.


రసీదును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కె హరిత



## గృహనిర్బంధంలో భరత్ చౌహాన్

**ఉట్నూర్, మార్చి 25, ప్రభాతవార్త :**

గిరిజన హక్కుల కోసం చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించుటకు బయలుదేరుతున్న భరత్ చౌహాన్‌ని పోలీసులు గృహ నిర్బంధం చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు, ప్రభుత్వం గిరిజనులపై కపట ప్రేమను ప్రదర్శిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు భవిష్యత్తులో తప్పకుండా ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు ఆడే రాంప్రసాద్ సచిన్ రాథోడ్, ఉట్నూర్ టౌన్ ప్రెసిడెంట్, గణేష్ మహారాజ్ ఉట్నూర్ మండల ఉపాధ్యక్షులు బంజారా జాగృతి భజన్ మండలి అజయ్ చవాన్ తదితరులు ఉన్నారు.


ఆంజనేయ దీక్ష స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## ప్రసన్న ఆంజనేయ ఆలయ నిర్మాణ భూమి పూజ

**వాంకిడి, మార్చి 25, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో బుధవారం లక్ష్మీనగర్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్న ఆంజనేయ ఆలయ నిర్మాణ భూమి పూజ చేపట్టారు, తదనంతరం ఆంజనేయ స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, ఇట్టి కార్యక్రమానికి సర్పంచ్ చునర్కర్ సతీష్, ఉప సర్పంచ్ దీపక్ ముండే, బిజెపి నాయకులు ఎలాగతి సుచిత్, సామెల రమేష్, కాలనీవాసులు, మహిళలు, ఆంజనేయ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పార్లమెంట్

**తాండూర్, మార్చి 25, ప్రభాతవార్త :**

రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం నిర్వహించిన మాక్ పార్లమెంట్ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రిగా, కేంద్ర మంత్రులుగా, ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించారు. పార్లమెంట్ సమావేశాలు సందర్భంగా ప్రధానమంత్రి, మంత్రుల ప్రసంగాలు.. బడ్జెట్ పై చర్చ, ఆమోదం, ప్రశ్నోత్తరాలు, ఆయా నియోజకవర్గాల పార్లమెంట్ సభ్యులు సమస్యల ప్రస్తావనలు.. విమర్శలు.. గొడవలు.. తదితర అంశాలను ప్రస్తావిస్తూ విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, భారత పార్లమెంట్ పనితీరును అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో విద్యార్థులతో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, వేదికపై మాట్లాడే నైపుణ్యం, పాలనలో ప్రజల పాత్ర గురించి అవగాహన ఏర్పడుతుందన్నారు. విద్యార్థుల మాక్ పార్లమెంట్ ప్రదర్శనను ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కలిగి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు.



విద్యార్థులు నిర్వహిస్తున్న మాక్ పార్లమెంట్


వేలంపాట సమావేశాన్ని నిర్వహిస్తున్న అధికారులు

## కొత్తపల్లి వారసంత వేలం వాయిదా

**తాండూర్, మార్చి 25, ప్రభాతవార్త :**

ఐబి సమీపంలో ప్రతి శనివారం నిర్వహించే కొత్తపల్లి వారసంత వేలాన్ని వాయిదా వేసినట్లు సర్పంచ్ ఆకుల వెంకటేశం, కార్యదర్శి లక్షుఝుఝు ్మణ్ తెలిపారు. వారసంత ఆవరణలో బుధవారం వేలంపాట లక్షుఝుఝు ్మణ్నిర్వహించారు. అనుకున్న టార్గెట్ రాకపోవడంతో మేకలు, కూరగాయల వేలం పాట వాయిదా వేసినట్లు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు వేలంపాటను మళ్లీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ అనిల్ కుమార్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## పెట్రోల్ కొరత విషయంలో వదంతులు నమ్మవద్దు

### - తెలంగాణ భారత్ పెట్రోలియం డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి సురభి శరత్‌కుమార్

**తాండూర్, మార్చి 25, ప్రభాతవార్త :**

పెట్రోల్ కొరత విషయంలో వదంతులను నమ్మవద్దని తెలంగాణ భారత్ పెట్రోలియం డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి సురభి శరత్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ యుద్ధం వలన సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిరంతరము పరిస్థితిని గమనిస్తూ సరఫరాలో అంతరాయం లేకుండా ఆయిల్ కంపెనీలు నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. కంపెనీలు క్రెడిట్ సదుపాయం ఆపివేయడం, వాహనదారులు అవసరం లేకున్నా ఎక్కువ మొత్తంలో ఇంధనం కొనుగోలు చేయడం వలన పెట్రోల్ పంపులలో నిల్వలు ఉండటము లేదన్నారు. పౌర సరఫరా శాఖ, ఆయిల్ కంపెనీలు నిరంతరం పరిస్థితి గమనిస్తూ డిలర్స్ కలిసి కృత్రిమ కొరతను అధిగమించడానికి ప్రయత్నం చేస్తున్నట్టు వారు కోరారు. వాహనదారులు ఎప్పటిలాగే అవసరమైతేనే ఇంధనం కొనుగోలు చేయాలని, అవసరానికి మించి కొనుగోలు చేయవద్దని, వాహనదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ముల్కలపేటలో చిరుతల రామాయణం

### నాటక ప్రదర్శనకు అందరికీ ఆహ్వానం

**వేమనపల్లి, మార్చి 25, ప్రభాతవార్త**

మండలంలోని ముల్కలపేట గ్రామంలో గురువారం నుంచి సోమవారం వరకు ఐదు రోజులు చిరుతల రామాయణ నాటక ప్రదర్శన జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి రామాయణం నాటక ప్రదర్శనను తిలకించాలని కోరారు.

## బోర్వెల్ పనులను ప్రారంభించిన సర్పంచ్

**తాండూర్, మార్చి 25, ప్రభాతవార్త :**

కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రేపల్లెవాడ హనుమాన్ టెంపుల్ వద్ద బుధవారం బోర్వెల్ పనులకు సర్పంచ్ ఆకులు వెంకటేశం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల సందర్భంగా స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం బోర్వెల్ వేయించామన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ కుమార్, కార్యదర్శి లక్ష ్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


బోర్వెల్ పనులకు కొబ్బరికాయ కొడుతున్న సర్పంచ్ ఆకుల వెంకటేశం

## కొండపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

**పెంచికల్‌పేట్, మార్చి 25, ప్రభాతవార్త :**

మండలంలోని కొండపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లవాడలో ఉపాధి హామీ పథకం కింద మంజూరు అయిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ అన్నం రుక్మబాయి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో బురద, గుంతలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు సీసీ రోడ్ల నిర్మాణంతో సౌకర్యవంతంగా ప్రయాణం చేయగలుగుతారని అన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మి, నాయకులు గణపతి, పురుషోత్తం, పరదేశి, అశోక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రుక్మబాయి

# షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మార్చి 25, ప్రభాతవార్త**

జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఎ.సి.పి.లు ప్రకాష్, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, షెడ్యూల్డ్ కులములు అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ లతో కలిసి పోలీస్, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు, ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో అట్రాసిటీ కేసులు, పరిష్కారం, బాధితులకు న్యాయం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న ఎస్.సి., ఎస్.టి. సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి. అభివృద్ధి, కేసులు, ఎన్ ఫోర్స్ మెంటు అమలు అంశాలపై తీసుకుంటున్న చర్యలపై సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎస్.సి., ఎస్.టి.లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఇండ్లు నిర్మించుకోలేని వారికి గుత్తేదారుల సమన్వయంతో ఇల్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాలు, ఆసుపత్రులు తదితర సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రగతికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. దండేపల్లిలోని పివిటిజి, తాండూర్‌లో ఎస్.టి. వసతి గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, గురుకులాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలలో అందరికీ అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. పోలీసు శాఖ పరిధిలోని అట్రాసిటీ కేసులు కార్యచరణ ప్రకారంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అట్రాసిటీ కేసులలో తప్పుడు కేసులు నమోదు చేసిన వాటి వివరాలను స్పష్టంగా రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ కేసులలో ఫిర్యాదుదారులు చేసిన ఫిర్యాదులో వివరాలు సక్రమంగా ఉన్నట్లయితే సమగ్ర విచారణ జరిపి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2023 డిసెంబర్ వరకు నమోదైన కేసులలో బాధితులకు గత సంవత్సరం 1 కోటి 34 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రతి నెల నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం నిర్వహణలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పౌర హక్కుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి, నిషేధిత మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా చేపట్టాలని, జిల్లాలో క్రయ విక్రయాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నాణ్యమైన విద్య బోధన అందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. పారిశుధ్యం, త్రాగునీరు ఇతర ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల నియంత్రణపై ఎస్.సి., ఎస్.టిలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను గ్రామపంచాయతీలలో నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరికి హక్కులపై అవగాహన కలుగుతుందని తెలిపారు. 2025 సంవత్సరములో 117 అట్రాసిటీ కేసులు నమోదు అయ్యాయని, కేసుల పరిష్కారంలో సాంకేతికతను ఉపయోగిస్తున్నామని, సరైన ఆధారాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, బెక్కం రాజారావు, దుర్గం ఎల్లయ్య, పెద్ది రాజన్న, జిల్లా పౌర సంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, ఎ.టి.డి.ఓ. సురేష్, కలెక్టరేట్ బి విభాగం పర్యవేక్షకులు మధుసూదన్, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

## అరైవ్ అలైవ్ ప్రచారం.. రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి

### - ఎన్‌హెచ్‌ఏఐ పెట్రోలింగ్ బృందాలతో ఏసీపీ సమీక్ష

### - ప్రమాదాల నివారణకు మార్గదర్శకాలు

**మందమర్రి, మార్చి 25, ప్రభాతవార్త**

రహదారి భద్రతే లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మందమర్రిలో ఎన్‌హెచ్‌ఏఐ పెట్రోలింగ్ బృందాలతో బెల్లంపల్లి ఏసీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణలో పెట్రోలింగ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉండాల్సిన బాధ్యతలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించి క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తరలించడం అత్యవసరమని స్పష్టం చేశారు. రహదారిపై నిలిచిపోయిన వాహనాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి, వేగ పరిమితిని మించిన వాహనదారులను గుర్తించి తగిన హెచ్చరికలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రయాణికుల ప్రాణాలను కాపాడటమే ప్రతి ఒక్కరి ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సిఐ, ఎస్ఐ, కాసిపేట ఎస్ఐ, ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## ఉద్యమకారులకు స్వాతంత్ర్య సమరయోధుల హక్కులు కల్పించాలి

### - తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్

**మందమర్రి, మార్చి 25, ప్రభాతవార్త**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాడిన ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులతో సమానంగా గుర్తించి హక్కులు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ కోలుగూరి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి గౌరవించాలని అన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించడం, ప్రభుత్వ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు మంజూరు చేయడం, ఉపాధి కోసం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించడం, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడం, ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం వంటి డిమాండ్లను ఆయన ప్రస్తావించారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, వారి త్యాగాలకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వేముగంటి రవీందర్, పల్లె నరసింహులు, పోలు కుమారు, ఎండి ఖలీం, మడిపల్లి వెంకటేశం గౌడ్, నామని ముత్తయ్య, బత్తుల సరిత, కొండిల్ల శ్రీనివాసు, ఎండి పాషా, కే సారంగం, కలిగిరి కనకరాజులు తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు, నాయకులు

## ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**తాండూర్, మార్చి 25, ప్రభాతవార్త :**

మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. ఆధార్ కేంద్రాన్ని బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆధార్ కార్డులో చిరునామా మార్పు, ఏమైనా తప్పులు ఉంటే ప్రజలు అప్డేట్ చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుశ్నపల్లి లక్ష్మీనారాయణ, ఎంపీఓ అనిల్ కుమార్, డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, నీలాయపల్లి సర్పంచ్ తిరుపతి, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, గిర్ధవర్ ఏజాజోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా విద్యాధికారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## జిల్లా విద్యాధికారికి ఘన సన్మానం

### - విద్యారంగ సమస్యలపై చర్చ

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాధికారి కార్యాలయంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాధికారి లలితకి ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పర్ష చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రాథోడ్ సుభాష్ పాల్గొని విద్యారంగానికి సంబంధించిన పలు సమస్యలను విద్యాధికారికి వివరించారు. ఈ సందర్భంగా విద్యాధికారి లలిత స్పందిస్తూ ఉపాధ్యాయులు, పాఠశాలలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు త్వరలో చేపడతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏఓ దేవాజీ,అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు ఇంధన సరఫరా సక్రమంగా అందించాలి

### - సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్

**కాగజ్‌నగర్ రూరల్,మార్చి 25, ప్రభాతవార్త :**

వినియోగదారులకు ఇంధన సరసర సక్రమంగా అందించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పెట్రోల్ బంక్‌ను జీసీసీ ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి పెట్రోల్ బంక్ లో జరుగుతున్న లావాదేవీలు, రిజిస్టర్లు, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, గాలి మిషన్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెట్రోల్ బంకులో త్రాగునీరు, మూత్రశాలల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ఇంధనం అవసరం మేరకు ముందస్తుగా తెప్పించుకోవాలని, నో స్టాక్ బోర్డులు పెట్టొద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ ఇంచార్జి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.





చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ బల్గూరి అజయ్

## కౌట్ల (బి) గ్రామంలో చలివేంద్రం ప్రారంభం

**సారంగాపూర్, మార్చి 25, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో బుధవారం సర్పంచ్ బల్గూరి అజయ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం బాటసారులకు, రైతులకు వేసవి తాపం నుండి ఉపశమనం కలిగిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో దారి వెంట వెళ్లే ప్రయాణికులకు, కూలీలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఈ ఏర్పాటు చేశామన్నారు. ఈ సౌకర్యాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, మధు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



హనుమాన్ స్వాములతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్సై సంజయ్ కుమార్

## శ్రీరామనవమి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి: ఎస్సై సంజయ్ కుమార్

**బజార్‌హత్నూర్, మార్చి 25, ప్రభాతవార్త:**

శ్రీరామనవమి ఉత్సవాలను భక్తులు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బజార్‌హత్నూర్ ఎస్సై సంజయ్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హనుమాన్ స్వాములతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భక్తులు, కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.వేడుకలను పరస్పర సామరస్యంతో, క్రమశిక్షణతో నిర్వహించాలని ఎస్సై విన్నవించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు పి. నారాయణ, జి. రమేష్, ఏ. సాయన్న, కే. నందు కుమార్, ఏ. రాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు

**లక్షెట్టిపేట, మార్చి 25, ప్రభాతవార్త**

పట్టణంలోని ఎంపీపీస్ ముల్కలగూడ పాఠశాల నుండి 8 విద్యార్థులు గురుకుల పాఠశాల ఎంపిక పరీక్ష రాశారు. ఫలితాలు వెలువడగ మొదటి లిస్టులోనే 8 మంది విద్యార్థులకు సీట్లు రావడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జి. శైలజ బుధవారం రోజు పాఠశాలకు విచ్చేసి విద్యార్థులకు అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా తన మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఇదేవిధంగా ముందుకు సాగుతూ ఉన్నత స్థానాల్లో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న మండల విద్యాధికారి

# వాలిడేషన్ యాక్ట్ 2025ను వెంటనే ఉపసంహరించుకోవాలి

**- విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజమల్లయ్య**

**లక్షెట్టిపేట, మార్చి 25, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం వాలిడేషన్ యాక్ట్ 2025ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల లక్షెట్టిపేట యూనిట్ అధ్యక్షులు నేరెళ్ల రాజ మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తిప్పని మధుసూదన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వాలిడేషన్ యాక్ట్ 2025 విశ్రాంత ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. ఈ చట్టం వలన 2026, జనవరికి ముందు రిటైర్ అయిన వారికి పెన్షన్‌లో ఎలాంటి పెరుగుదల ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. 2026, జనవరి తర్వాత ఉద్యోగ విరమణ పొందిన వారికి మాత్రమే పీఆర్సీ, డీఆర్‌లతో పాటు ఇతర బెనిఫిట్స్ వర్తిస్తాయనడం అన్యాయమన్నారు. ఈ చట్టం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కు పూర్తి వ్యతిరేకమని తెలిపారు.చట్టం ముందు అందరూ సమానులే అని స్పష్టంగా ఉన్నప్పటికీ విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పెరుగుదల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి శోచనీయమన్నారు. 1979లో రిటైర్డ్ ఎంప్లాయిస్ పెన్షన్స్ పెరుగుదలకు వ్యతిరేకంగా వచ్చిన ఆదేశాలపై డీ ఎస్ నాకర ఆధ్వర్యంలో భారత అత్యున్నత న్యాయస్థానంను ఆశ్రయించగా, అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తో కూడిన 5 గురు సభ్యుల బెంచ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ కు పెన్షన్స్ లో ఎలాంటి వివక్ష చూపరాదని, చట్టం ముందు అందరూ సమానం కాబట్టి పెన్షనర్స్‌కు కాలనుగుణంగా పెరుగుదల ఉండాలని తీర్పునిచ్చిందన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ సేవలకు చెల్లించే మూల్యంపైన కేంద్ర ప్రభుత్వం వివక్షతను విడనాడాలని వెంటనే వాలిడేషన్ యాక్ట్ 2025 ను ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది ఎవరి దయా, దాక్షిణ్యాల మీద ఇచ్చేది కాదని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైన తమ వైఖరి మార్చుకుని పెన్షనర్స్ కు న్యాయం చేయాలని కోరారు. లేనిచో రాష్ట్ర కమిటీ ఆదేశాలతో మరిన్ని నిరసన, ఆందోళన కార్యక్రమాలు కూడా చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఎన్నో ఏండ్లు ప్రభుత్వానికి అనేక రకాలుగా సేవలు అందిస్తే, ఇప్పుడు రిటైర్డ్ ఎంప్లాయిస్ కు అన్యాయం చేయడం కేంద్ర ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. అంతకుముందు తహసీల్దార్ దిలీప్ కుమార్ కు పెన్షనర్స్ సమస్య పరిష్కారం కోసం వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో యూనిట్ అధ్యక్షులు నేరెళ్ల రాజమల్లయ్య, ప్రధాన కార్యదర్శి తిప్పని మధుసూదన్, కోశాధికారి రాచర్ల సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు జంగం ఆశయ్య, ఉపాధ్యక్షులు దేవేంద్ర విజయుడు, అమీర్ సుల్తాన, జాయింట్ సెక్రటరీ కొట్టె రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్నం సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి కొండపర్తి సత్యనారాయణ, సభ్యులు సత్యనారాయణ, పెట్టెం మల్లయ్య, గడ్డం లింగయ్య, కోడి సంపూర్ణ, నూతి శంకరయ్య, మేడి బాలరాజు, వొజ్జల మనోహర్, ప్రతాప్, వేల్పుల లింగం (సాగర్) తదితరులు పాల్గొన్నారు.




ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగులు

## విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు అటవీ అధికారులపై వేటు

**జన్నారం, మార్చి 25, ప్రభాతవార్త**

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు అటవీశాఖ అధికారులపై వేటు పడింది. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లోని జన్నారం డివిజన్‌కు చెందిన ఇద్దరు అటవీ అధికారులను అటవీ శాఖ ఉన్నతాధికారులు బుధవారం సస్పెండ్ చేశారు.విధుల్లో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణతో జన్నారం ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కుమారస్వామి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లవన్ కుమార్ లను సస్పెండ్ చేసినట్లు స్థానిక ఎఫ్డీఓ ఎం.రామ్మోహన్ తెలిపారు. డిప్యూటి రేంజ్ ఆఫీసర్ కుమార స్వామిని కాళేశ్వరం జోన్ పీసీసీఎఫ్ ప్రభాకర్ సస్పెండ్ చేయగా, బీట్ ఆఫీసర్ లవన్ కుమార్ ను మంచిర్యాల డీఎఫ్ఓ శివ్ ఆశీష్ సింగ్ సస్పెండ్ చేశారని ఎఫ్డీఓ రామ్మోహన్ తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారని అభియోగంతో ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు.



భగీరథ పైప్ లైన్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

## 13వ వార్డులో మిషన్ భగీరథ పైపులైన్లు మరమ్మతులు

**లక్షెట్టిపేట, మార్చి 25, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట పట్టణంలోని 13వ వార్డులో మిషన్ భగీరథ పైప్ లైన్ గత కొన్ని రోజులుగా పైప్ లైన్ పగలడంతో స్థానిక 13వ వార్డు కౌన్సిలర్ బిరుదుల సత్యనారాయణ దృష్టికి తీసుకురావడంతో తను చైర్మన్ దొంత అంజలి నరసయ్యకు తెలుపగా జెసిబి సాయంతో తవ్వి మిషన్ భగీరథ పైప్ లైన్‌ను సవరించడం జరిగింది. అక్కడ ప్రజలు మిషన్ భగీరథ నీళ్లు రాక చాలా ఇబ్బందిగా ఉంది. నీటి కొరతకు తావు లేకుండా చేసినందుకు చైర్మన్,వైస్ చైర్మన్, 13వ వార్డు కౌన్సిలర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దొంత అంజలి నరసయ్య, వైస్ చైర్మన్ మోత్కూరి రాజేశ్వరి వెంకట్ స్వామి గౌడ్. 13వ వార్డు కౌన్సిలర్ బిరుదుల సత్యనారాయణ, వార్డు అధ్యక్షులు హాజీ, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న

## నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం చెల్లించాలి: సంగెపు బొర్రన్న

**బజార్‌హత్నూర్, మార్చి 25, ప్రభాతవార్త:**

ప్రకృతి విపత్తు కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం చెల్లించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని కొల్హారి గ్రామ పరిధిలో అకాల వర్షాలు, ఈదురు గాలుల ధాటికి నేలమట్టమైన మొక్కజొన్న, జొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బొర్రన్న మాట్లాడుతూ.. బజార్‌హత్నూర్‌కు చెందిన రైతు చందర్‌తో పాటు కొల్హారి గ్రామ పరిధిలో దాదాపు 45 ఎకరాలకు పైగా పంట నష్టపోయిందని తెలిపారు. చేతికి వచ్చే సమయంలో పంటలు నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా సమగ్ర అంచనా వేయించాలని కోరారు. నష్టపోయిన ప్రతి గుంట భూమిని రికార్డు చేసి, నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని అధికారులను కోరారు. రైతులు ధైర్యంగా ఉండాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు జి. రవి, నర్సయ్య, శ్రీనివాస్, చిన్నయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు ఆటో ట్రాలీల కోసం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

**జన్నారం, మార్చి 25, ప్రభాతవార్త**

మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ శానిటేషన్ కోసం అదనంగా రెండు ఆటో ట్రాలీలను కేటాయించాలని కోరుతూ పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, పంచాయతీ కార్యదర్శి రాహుల్ గుప్తా మంగళవారం సాయంత్రం ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఇచ్చిన లెటర్, వినతి పత్రాన్ని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ కావడంతో శానిటేషన్ కు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని కావున పొనకల్ మేజర్ గ్రామపంచాయతీకు అదనంగా రెండు ఆటో ట్రాలీలను కేటాయించాలని కలెక్టర్‌కి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**జన్నారం, మార్చి 25, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. బుధవారం జన్నారం మండలంలోని పొనకల్, జన్నారం గ్రామపంచాయతీ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను, పారిశుధ్యం పనులను, పివిపి పార్క్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలు తీరును పరిశీలించి లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇండ్లు త్వరగా నిర్మించుకునేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సకాలంలో నీటిని అందించి మొక్కలను పరిరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నేరెళ్ల రామ్మోహన్ ,ఎంపీడీవో ఉమర్ షరీఫ్ ,ఎంపీఓ జలంధర్, హౌసింగ్ ఏఈ లాయకత్ అలీ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నందన వర్మ, పొనకల్, జన్నారం గ్రామాల సర్పంచ్లు జక్కు సుష్మ భూమేష్, అజ్మీర కళావతి నందు నాయక్, ఉపసర్పంచ్ అప్పాల జలపతి, పంచాయతీ కార్యదర్శి రాహుల్ గుప్త, బిల్ కలెక్టర్ అనీల్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





వంతెనను పరిశీలిస్తున్న అసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత

## లెండిగూడ లోలెవల్ వంతెనను పరిశీలించిన కలెక్టర్ హరిత

**జైనూర్, మార్చి 25, ప్రభాతవార్త:**

కొమరం భీమ్ అసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని లెండిగూడ సమీపంలో గల లోలెవల్ వంతెనను జిల్లా కలెక్టర్ హరిత బుధవారం పరిశీలించారు. గౌరీ కోలాంగూడ గ్రామ పంచాయతీకి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఈ వంతెన పరిస్థితిని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుధాకర్ రెడ్డి కలెక్టర్‌కు వివరిస్తూ.. వర్షాకాలంలో వరద నీరు వంతెనపై నుండి ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. దీనివల్ల గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమస్యను సావధానంగా విన్న కలెక్టర్, నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో భూక్యా శశికుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి ఒకటో వార్డు యువకులు, ప్రజల చిరు సాయం

**క్యాతన్‌పల్లి, మార్చి 25, ప్రభాతవార్త**

ఒకటో వార్డుకు చెందిన నిరుపేద సూర మల్లు అనారోగ్యంతో రెండు రోజుల క్రితం చనిపోయాడు. ఆయన కుటుంబానికి అండగా మేమున్నామంటూ ఒకటో వార్డు యువత, ప్రజలు సహాయం చేయడానికి ముందుకు వచ్చి ఇరవై వేల రూపాయలను అందించారు. చెన్నమల్లు కుటుంబానికి సహాయం అందించిన యువత, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశనవేణి సత్యనారాయణ, పోగుల మల్లయ్య, పిల్లి సతీష్, ముక్తి శ్రీనివాస్, మేకల కుమారస్వామి, భుక్య బాలాజీలు పాల్గొన్నారు.

## మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, మార్చి 25, ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో కొనసాగుతున్న మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని మహిళా సమాఖ్యల కొరకు చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



సిసి రోడ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్

## సిసి రోడ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేసిన నారాయణరావు పటేల్

**భైంసా, మార్చి 25, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ముధోల్ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జ్ నారాయణరావు పటేల్ కుబీర్ మండల నాయకులకు సిసి రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మంజూరైన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంక బాబు, జిల్లా కార్యదర్శి పురంశెట్టి రవికుమార్, దత్తురాం, కుబీర్ మండల అధ్యక్షుడు బసిరుద్దీన్, పరశురాం, శివాజీ, జాడి శ్రీనివాస్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నికలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలి

**- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

**క్యాతన్‌పల్లి, మార్చి 25, ప్రభాతవార్త**

క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో ప్రజా తీర్పును గౌరవించాలని ఆసిఫాబాద్ ఎం.ఎల్.ఏ కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 17న జరిగిన అల్లర్ల కేసులో కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయగా, ఆమె బుధవారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ పార్టీ మంత్రి వివేక్ ఉద్దేశ్యపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు. క్యాతన్‌పల్లి ప్రజలు బి.ఆర్.ఎస్, సీ.పి.ఐ పార్టీల కూటమికి మెజారిటీ ఇచ్చారని, ఆ తీర్పును గౌరవించి ప్రజా స్వామ్య బద్ధంగా, ప్రశాంత వాతావరణంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరిగేలా ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు రామిడి కుమార్, కొంగల తిరుపతి రెడ్డి, మద్ది శంకర్,ఆర్నె సమ్మయ్య, యూత్ నాయకులు రామిడి లక్ష్మీకాంత్, బెల్లం అరుణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలి: ఎమ్మెల్యే రామారావు పటేల్



**భైంసా, మార్చి 25, ప్రభాతవార్త:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీలో ఇందిరమ్మ ఇండ్ల అంశంపై ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో భైంసా పట్టణంలో తప్ప నియోజకవర్గంలో ఎక్కడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు పూర్తి కాలేదని విమర్శించారు. పేదలకు ఇండ్లు ఇస్తామని గత ప్రభుత్వం మోసం చేసిందని, అప్పట్లో ఇండ్లు కావాలంటే కమిషన్లకు కక్కుర్తి పడి వ్యవస్థను నాశనం చేశారని మండిపడ్డారు. ముధోల్ నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని, ప్రస్తుత ప్రభుత్వం ఇక్కడ పెద్ద మొత్తంలో ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని కోరారు. గత పదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారో, గత రెండేళ్లలో ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారో వివరాలు ఇవ్వాలని కోరారు. అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు అందేలా చూడాలని, పాత ఇండ్లకు వెంటనే నిధులు విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## మూర్ఛవ్యాధితో యువకుడి మృతి

**సారంగాపూర్, మార్చి 25, ప్రభాతవార్త:**



మండల కేంద్రానికి చెందిన మొగలి రాము (28) మూర్ఛవ్యాధితో పొలంలో మరణించిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రాముకు తరచూ మూర్ఛ వచ్చేది. మంగళవారం సాయంత్రం సారంగాపూర్ శివారులో గడ్డి కోయడానికి వెళ్లిన ఆయన రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు వెతకగా, శివారులోని మూలగోలి పొలాల్లో గడ్డి కోసిన ప్రదేశంలో మృతి చెంది కనిపించారు. గడ్డి కోస్తుండగా మూర్ఛ రావడంతో వరి మడుగులో పడి ఊపిరి ఆడక చనిపోయినట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

**దండేపల్లి, మార్చి 25, ప్రభాతవార్త**



దండేపల్లి మండలంలోని పెద్దంపేట చెరువులో పడి నర్మల లింగయ్య (64) ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం ఉదయం తోటి మత్స్యకారులతో కలిసి గ్రామ శివారులోని ఎర్రకుంట చెరువుకు చేపల వేటకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. చేపల వేట కొనసాగిస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించినట్లు ఎస్ఐ తైసిద్దీన్ ధృవీకరించారు. లింగయ్య చెరువులోకి వల విసిరి వెనక్కి లాగుతున్న క్రమంలో పట్టు తప్పి నీటిలో పడిపోయాడు. నీట మునిగి ఊపిరి ఆడకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి మత్స్యకారులు గమనించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బుచ్చయ్యపల్లిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి

### - తాగునీరు, రహదారి సదుపాయాల మెరుగుదలపై దృష్టి, ప్రజల్లో ఆనందం

**బెల్లంపల్లి, మార్చి 25, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గంలో గ్రామీణాభివృద్ధికి మరింత ఊతమిస్తూ, బుచ్చయ్యపల్లి గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు గ్రామంలో తాగునీరు, రహదారి సదుపాయాల మెరుగుదల కోసం చర్యలు చేపట్టడం జరిగింది. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ నాయకత్వంలో గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బుచ్చయ్యపల్లి గ్రామంలో మూడు కొత్త బోర్‌వెల్ పంప్ సెట్లను ఏర్పాటు చేసి, వాటిని గ్రామ సర్పంచ్ జాడి మహేశ్వర్, ఉపసర్పంచ్ జక్కుల పవణ్ కల్యాణ్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామంలో తాగునీటి సమస్య చాలాకాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని, కొత్తగా ఏర్పాటు చేసిన బోర్‌వెల్ పంప్ సెట్ల ద్వారా గ్రామ ప్రజలకు తాగునీరు అందుబాటులోకి వచ్చి సమస్యకు కొంత మేర ఉపశమనం లభిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామంలోని రహదారుల అభివృద్ధిపై కూడా దృష్టి సారించి, అంతర్గత రహదారులను మెరుగుపరిచి ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు కోలా మహేష్, కర్ణాటక ఓదెలు, కోల వెంకటేష్, వేల్పుల యిల్లయ్య, వేల్పుల గంగామల్లు, యదునూరి చంద్రమోళి, మంచాల శ్రీను, కొమ్ము ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# సింగరేణి కార్మికులపై ఆరోపణలు అన్యాయం

### - ఏఐటీయూసీ తీవ్ర ఆగ్రహం, వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్

**బెల్లంపల్లి, మార్చి 25, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థలో మెడికల్ ఇన్వాల్యుయేషన్ ప్రక్రియ కారణంగా సంస్థపై ఆర్థిక భారం పడుతోందని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై కార్మిక వర్గాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ మండిపడ్డారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివారని, వారు అండర్‌గ్రౌండ్ గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తూ దేశానికి అవసరమైన విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి కార్మికుల సేవలను తక్కువ చేసి చూపేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న కార్మికులు గనుల్లో పనిచేసే కార్మికుల పరిస్థితి అత్యంత క్లిష్టమైనదని, ప్రతి రోజు ప్రమాదాలతో పోరాడుతూ విధులు నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు. గనుల్లో గాలి లోపం, అగ్ని ప్రమాదాలు, పైకప్పు కూలే ప్రమాదాలు, విషవాయువుల ముప్పు వంటి అనేక ప్రమాదాలు ఎప్పటికప్పుడు ఎదురవుతుంటాయని చెప్పారు. డ్యూటీకి వెళ్లిన కార్మికుడు సురక్షితంగా తిరిగి వస్తాడా లేదా అన్న భయం వారి కుటుంబ సభ్యులను వెంటాడుతుందని, అలాంటి పరిస్థితుల్లో పనిచేసే కార్మికులపై ఆరోపణలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. గనుల్లో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు అమలులో ఉన్న వారసత్వ ఉద్యోగ హక్కును గతంలో నిలిపివేయడం వల్ల ఇప్పటికే కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఇప్పుడు మెడికల్ ఇన్వాల్యుయేషన్ విధానాన్ని కూడా నిలిపివేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది కార్మికుల భద్రత, సంక్షేమానికి విరుద్ధమని విమర్శించారు. మెడికల్ ఇన్వాల్యుయేషన్ అనేది కార్మికుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి వారికి తగిన ఉపశమనం కల్పించే ముఖ్యమైన విధానం అని, దానిని భారం అనే కోణంలో చూడడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రావాల్సిన నిధులను సమయానికి విడుదల చేయకపోవడం వల్ల సంస్థలో పలు సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. ఆధునిక యంత్రాల కొనుగోలు లోపం గనుల అభివృద్ధి పనుల్లో ఆలస్యం ఈ కారణాల వల్ల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతింటున్నాయని, కార్మికుల భద్రత కూడా ప్రమాదంలో పడుతోందని తెలిపారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాల్సిన సమయంలో, వారిపై ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యంగా ఉందని మల్లేష్ విమర్శించారు. సింగరేణి వంటి కీలక సంస్థను



బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, సరైన విధానాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. డిప్యూటీ సీఎం చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, సింగరేణికి రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలి, కార్మికుల భద్రతకు అవసరమైన సేఫ్టీ పరికరాలు అందించాలి, మెడికల్ ఇన్వాల్యుయేషన్ విధానాన్ని కొనసాగించాలి కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. సింగరేణి కార్మికులు దేశానికి సేవ చేస్తున్న అగ్రగామి శ్రామికులు అని, వారి కష్టాన్ని గౌరవించే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలని ఏఐటీయూసీ స్పష్టం చేసింది. కార్మికుల హక్కులను కాపాడేందుకు అవసరమైతే ఉద్యమాలకు కూడా సిద్ధమని హెచ్చరించారు.




## మంట కలుస్తున్న రక్త సంబంధాలు..

### - ఆస్తి తగాదాలతో తమ్ముడిని చంపేందుకు సిద్ధపడ్డ అన్న కుటుంబం

**చెన్నూరు, మార్చి 25, ప్రభాతవార్త**

తాతలు సంపాదించిన ఆస్తి విషయంలో తన వాటా అమ్మకోనిస్తలేడన్న కోపంతో తమ్ముడిని చంపేందుకు అన్న కుటుంబం సిద్ధపడింది. వివరాల్లోకి వెళితే చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని కొమ్మెర గ్రామానికి చెందిన జోగురు లక్ష్మిమల్లు, రాజయ్య అన్నదమ్ములు వారి తాతల కాలం నాటి భూమిని తమ వాటాల వారిగా సాగు చేసుకుంటున్నారని, లక్ష్మిమల్లు తన వాటకు చెందిన భూమి అమ్మకం విషయంలో తన తమ్ముడు రాజయ్యతో పలుమార్లు పంచాయతీ జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఎలాగైనా రాజయ్యను చంపాలన్న దుర్బుద్ధితో బుధవారం ఉదయం 9 గంటల సమయంలో లక్ష్మిమల్లు తన కుమారులు సమ్మయ్య, రవి ని. వెంటబెట్టుకుని రాజయ్య ఇంటి వద్దకు వెళ్లి గొడ్డలి, కర్రలతో దాడి చేసి కొట్టారని, రాజయ్య తలకు, కాలికి రక్తపు గాయాలు అవడంతో వెంటనే స్థానికులు వారిని విడిపించి రాజయ్యను చికిత్స నిమిత్తం చెన్నూర్ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. రాజయ్య కుమారుడు సంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మిమల్లు, అతని కుమారులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, సంఘటన స్థలానికి వెళ్లి విచారించిన అనంతరం నేరానికి పాల్పడిన లక్ష్మిమల్లు, అతని కుమారులు సమ్మయ్య రవి లను అంగ్రజుపల్లి గ్రామ శివారులో పట్టుకొని వారిని విచారించి వారి వద్దనుండి నేరానికి ఉపయోగించిన గొడ్డలి, కర్రలను స్వాధీనపరచుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి రిమాండ్ నిమిత్తం మంచిర్యాల కోర్టు ముందు హాజరు పరిచామన్నారు. అనంతరం లక్షెట్టిపేట్ జైలుకు పంపించడం జరిగిందని పేర్కొన్నారు.

## గిరిజన రైతులకు మేలు చేసేలా ఉద్యాన నర్సరీల అభివృద్ధి

### - ఉట్నూర్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్

**బెల్లంపల్లి, మార్చి 25, ప్రభాతవార్త**

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ పరిధిలోని ఉద్యాన నర్సరీల సంరక్షణ, అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ తెలిపారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో ఉన్న 100 ఎకరాల తోటను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల బలోపేతం, నాణ్యత పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి దిశగా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, అలాగే కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని రాజంపేట ప్రాంతాల్లో ఉన్న ఉద్యాన నర్సరీలను అధికారులు ఆకస్మికంగా సందర్శిస్తూ పర్యవేక్షణ బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ సంవత్సరం ఆగ్రో ఫారెస్ట్రీ, నేషనల్ బాంబూ (వెదురు) మిషన్ కార్యక్రమాల కింద సుమారు రూ. 2 కోట్ల నిధులతో నర్సరీల్లో మొక్కల పెంపకం, నీటి వసతులు, షేడ్ నెట్‌లు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటు చేపడుతున్నామని వెల్లడించారు. రైతులకు అవసరమైన మొక్కలను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ తక్కువ ధరలకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా మామిడి, వెదురు వంటి ఆర్థిక పంటలతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలు, అలంకరణ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా గిరిజన రైతులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆదాయం వృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఎన్ఎస్ఎస్ శిబిరంలో మూఢనమ్మకాలపై చైతన్యం

**లంబడితండాలో విద్యార్థుల అవగాహన యాత్ర, మ్యాజిక్ షోతో విశేష స్పందన**

బెల్లంపల్లి, మార్చి 25, ప్రభాతవార్త

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) ఏడు రోజుల వేసవి ప్రత్యేక శిబిరం కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ శిబిరం మూడో రోజు బుధవారం లంబడితండా గ్రామంలో విద్యార్థులు నిర్వహించిన మూఢనమ్మకాల నిర్మూలన అవగాహన కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అధ్యక్షతన, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ఎంఏ రేష్మ, గజెల్లి మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాలంటీర్లు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి, నినాదాలతో గ్రామ ప్రజలను చైతన్య పరిచారు.




**మత్తు వద్దు - ఆరోగ్యం ముద్దు.. మూఢనమ్మకాలను విడనాడండి..**

శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగండి.. వంటి నినాదాలతో విద్యార్థులు గ్రామంలోని ప్రతి వీధిలో తిరుగుతూ ప్రజలతో నేరుగా మమేకమై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ రంగ ప్రశాంత్ పాల్గొని విద్యార్థుల సేవాభావాన్ని ప్రశంసించారు.

**ఇంటింటికీ వెళ్లి చైతన్యం..**

విద్యార్థులు కేవలం ర్యాలీతోనే కాకుండా ఇంటింటికీ వెళ్లి గ్రామ ప్రజలతో చర్చలు జరిపారు. మూఢనమ్మకాల వల్ల కలిగే నష్టాలను వివరించి, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక నష్టాలు ఎలా ఎదురవుతాయో ఉదాహరణలతో వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్న అపోహలు, జ్యోతిష్యం, మంత్రాలు, తంత్రాల పేరుతో జరుగుతున్న మోసాలను గుర్తించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలకు శాస్త్రీయ, వైద్యపరమైన పరిష్కారాలను ఆశ్రయించాలని, అజ్ఞానాన్ని దూరం చేసుకోవాలని విద్యార్థులు పిలుపునిచ్చారు.

**మ్యాజిక్ షో ద్వారా శాస్త్రీయ అవగాహన..**

ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా పూలే-పెరియార్-అంబేద్కర్ ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక మ్యాజిక్ షో నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అక్కు ఉమ, కృష్ణ, గోడిసెల స్వామి తమ వినూత్న ప్రదర్శనలతో గ్రామ ప్రజలను ఆకట్టుకున్నారు. వారు మ్యాజిక్ ట్రిక్స్ ద్వారా మూఢనమ్మకాల వెనుక ఉన్న వాస్తవాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. సాధారణంగా అద్భుతాలు అనిపించే అనేక విషయాలు కేవలం మాయాజాలమని, వాటిని కొందరు తమ లాభాల కోసం ఉపయోగించుకుంటున్నారని వివరించారు. మనుషుల భయాలు, ఆశలు, సమస్యలను ఆసరాగా చేసుకుని కొందరు మోసగాళ్లు ఎలా డబ్బు దండుకుంటున్నారో ప్రత్యక్షంగా చూపించారు. ఈ ప్రదర్శనలు గ్రామ ప్రజల్లో మంచి చైతన్యం కలిగించాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి శాస్త్రీయ దృక్పథం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని, ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎంఏ రేష్మ, గజెల్లి మోహన్, అధ్యాపకులు, గ్రామ ఉపసర్పంచ్ రంగ ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, విద్యార్థిని-విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్న మూఢనమ్మకాల నిర్మూలనకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, విద్యార్థులు ముందుండి చైతన్యం కల్పించడం సమాజానికి ఆదర్శప్రాయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఎన్ఎస్ఎస్ శిబిరం ద్వారా విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించడమే కాకుండా, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



# ఆర్ఎంపి-పిఎంపి అనుభవ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా గోనె గోవర్ధన్

మందమర్రి, మార్చి 25, ప్రభాతవార్త

మందమరి పట్టణ ఆర్ఎంపి-పిఎంపి అనుభవ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా గోనె గోవర్ధన్ ను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని దొరల బంగ్లా ఏరియాలోని ఆర్ఎంపి సంఘం భవనంలో బుధవారం రాష్ట్ర కార్యదర్శి గాదాసు శంకరయ్య అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. సభ్యులందరూ అధ్యక్షునిగా గోనె గోవర్ధన్ ప్రధాన కార్యదర్శిగా అడ్డూరి సాంబమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వారికి ధ్రువ పత్రాలను అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పనిచేస్తున్న ఆర్ఎంపి పిఎంపి ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, 24 గంటలు వారికి అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అధ్యక్షునిగా ఎన్నుకొని బాధ్యతను పెంచారని సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి పిఎంపిలు కట్ల శ్రీనివాస్. చింతల పోశం మంద తిరుమలరెడ్డి, గాజుల శంకర్, ఏ లక్ష్ముఖ్ముణ్, గోనె సత్యం, శ్రీనివాస్, రాజు దాము గోనే శ్రీనివాస్. విజయ్ శర్మ మతిన్ ఖాన్ కాన్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులో అవకతవకలు

**- రీ సర్వే చేయాలని ఓపిడిఆర్ డిమాండ్**

బెల్లంపల్లి, మార్చి 25, ప్రభాతవార్త



బెల్లంపల్లి పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ గృహాల కేటాయింపులో తీవ్ర అవకతవకలు జరిగాయని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపిడిఆర్) ఆరోపించింది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబాల మహేందర్ తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ గృహాల కోసం ఆన్లైన్‌లో నమోదు చేసుకోవాలని రెవెన్యూ శాఖ ప్రకటించడంతో అనేక మంది దరఖాస్తులు చేసుకున్నారని, అయితే అర్హత పరిశీలన (ఎంక్వయిరీ) ప్రక్రియలో సంబంధిత అధికారులు పారదర్శకత పాటించలేదని పేర్కొన్నారు. నిజంగా పారదర్శకంగా పరిశీలన జరిపి ఉంటే అర్హులైన పేదలకు గృహాలు అందేవని, కానీ అధికార ప్రభావం, హోదా ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చి ఎలిజిబుల్ లిస్టులు తయారు చేయడం విచారకరమన్నారు. సింగరేణి సంస్థలో పనిచేసి పెన్షన్ పొందుతున్న కొంతమంది వ్యక్తుల పేర్లు కూడా అర్హుల జాబితాలో ఉండటం గమనార్హమని తెలిపారు. ఇంకా, ఇంద్రమ్మ గృహ పథకంలో ఇప్పటికే లబ్ధి పొందిన వారికి కూడా మళ్లీ డబుల్ బెడ్ రూమ్ కేటాయించడం అధికారుల అవినీతి, బంధుప్రీతి, విధి విరుద్ధ చర్యలకు నిదర్శనమని విమర్శించారు. సోషల్ మీడియాలో మూడు లక్షల రూపాయలు ఇస్తేనే గృహం కేటాయిస్తున్నారనే వార్తలు రావడం పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మార్చిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రతి వార్డు నుంచి ప్రతినిధులతో సిటిజన్స్ కమిటీ ఏర్పాటు చేసి రీ సర్వే నిర్వహించి నిజమైన అర్హులకు గృహాలు కేటాయించాలని ఓపిడిఆర్ డిమాండ్ చేసింది. లేని పక్షంలో అర్హులైన లబ్ధిదారులను సమీకరించి సంబంధిత అధికార కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించింది.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమావేశానికి ఆహ్వానం

మంచిర్యాల, మార్చి 25, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 51 వ డివిజన్ లక్ష్మి నగర్‌లోని రోడ్ నెంబర్ 4లో గురువారం ఉదయం 10 గంటలకు మంచిర్యాల జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణాపూర్, శ్రీరాంపూర్, నస్పూర్, గోలేటి ఏరియాలలోని సింగరేణి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన గలరని విజ్ఞప్తి చేశారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు (పెన్షన్ దారులకు) బొగ్గు గని కార్మికుల పెన్షన్ సవరణ కొరకు 2026 మార్చి 30 న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించనున్నారని, ఈ ధర్నాకు మన అసోసియేషన్ మద్దతు పలుకుతున్న విషయం కాగా వయోభారం రీత్యా, వైద్యపరమైన, ఆరోగ్య పరమైన, ఇతర సమస్యలతో అనివార్య కారణాల వలన ధర్నాలో పాల్గొనలేని కోల్ పెన్షనర్లు తాము నివసిస్తున్న నివాసంలో తమ కుటుంబ సభ్యులతో లేదా సాముహికంగా బహిరంగ ప్రదేశాల్లో,పార్కులు,కమ్యూనిటీ హాల్స్ లో మార్చి 30 తేదీ నాడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫించన్ సవరణ కొరకు నినాదాలు ఇస్తూ, ప్రసంగాలు చేసి ఆ ఫోటోలు వీడియోలు ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ వారికి పంపించి వారికి సంఘీభావం తెలిపే అవసరం ఎంతైనా ఉందని,కావున మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్, మందమర్రి, నస్పూర్, పాత మంచిర్యాలలలో నివసిస్తున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఇందులో పాల్గొనగలరు అని,ఈ విషయం పైన గురువారం రోజున లక్ష్మీ టాకీస్ బైపాస్ రోడ్ పక్కన లక్ష్మి నగర్, డివిజన్ నెంబర్ 51లో గల రోడ్ నెంబర్ 4లో ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిదని,ఈ సమావేశంలో జంతర్మంతర్ వద్ద ఈనెల 30న జరిగే ధర్నాకు సంఘీభావం తెలపడానికి ఈ అంశంపై చర్చించడం జరుగుతుందని, కావున సమావేశానికి తప్పక హాజరు కాగలరని కోరారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల అత్యవసర సమావేశంలో గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, పూదరి నర్సయ్య ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి కొక్కిస రాజగౌడ్, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంతి సింగరేణి సభ్యులు